
సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



గస్తీకి సుస్తీ.. దొంగలు మస్తీ..!

కంభంలో దొంగలు హడలెత్తిస్తున్నారు. వరుస చోరీలతో ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. పోలీసులకు సైతం సవాల్ విసురుతున్నారు.

- 8లో..



పొదిలిలో ముగిసిన పొగాకు వేలం

పొదిలి పొగాకు వేలం కేంద్రంలో వేలం ముగిసింది. ఈ కేంద్రంలో ఈ ఏడాది రూ.385.50 కోట్ల విలువైన పొగాకు కొనుగోళ్లు జరిగాయి.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37/26

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటీరెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.



అభినేత్రి ఓ అభినేత్రి
అభినయనేత్రి నట గాయత్రి
మనసారా నిను తిలకించి
పులకించింది ఒంగోలు..

తన కోసం వచ్చిన అభిమానులను చూసి మురిసిపోయింది కీర్తిసురేష్. గురువారం నగరంలోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె వచ్చారు...

కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేకపోగా చిరుద్యోగుల పొట్టకొట్టి వారి కుటుంబాలను రోడ్డున పడేస్తోంది. ఇప్పటికే వలంటీర్లు, పారిశుధ్య కార్మికుల ఉసురుపోసుకుంది. నూతన మద్యం పాలసీతో తాజాగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించింది. ఎన్నికల సమయంలో లక్షల సంఖ్యలో కొత్త ఉద్యోగాలు కల్పిస్తామని హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక వరుసగా ఉన్న ఉద్యోగాలు తీసివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'మా ప్రభుత్వం వచ్చింది.. మీరు ఇంటికి వెళ్లండి' అంటూ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ప్రత్యేక కథనం...

ఇది మా ప్రభుత్వం..
ఇక ఇంటికెళ్లండి..!



- ఎన్నికల్లో లక్షలాది ఉద్యోగాలిస్తామంటూ చంద్రబాబు హామీ
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలు పీకివేత
- ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న చిరుద్యోగుల పొట్టకొట్టిన వైనం
- వచ్చీరాగానే వలంటీర్లను పక్కన పెట్టి వేధింపులు
- పారిశుధ్య కార్మికులను సైతం వదిలిపెట్టని కూటమి పార్టీల శ్రేణులు
- వేలాది కుటుంబాలతో ఆటలాడుకోవడంపై ఆగ్రహ జ్వాలలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

మోసపూరిత హామీలు, అబద్ధాలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. వంద రోజుల పాలనలో ఒక్క మంచి పని కూడా చేయకపోగా, అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోచుకో..దాచుకో అన్నట్టుగా వ్యవహరిస్తోంది. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఇప్పటికే ఇసుక, రేషన్ బియ్యం, అధికార యంత్రాంగం బదిలీలు, భూ ఆక్రమణలు, దాడులు, దౌర్జన్యాలతో రెచ్చిపోతూ ధనదాహంతో పరుగులు తీస్తున్నారు. కొత్తగా, మద్యం వ్యాపారంపై వారంతా కన్నేశారు. తమ పార్టీల నేతలకు దోచిపెట్టేందుకు నూతన మద్యం పాలసీ తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం.. ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వందలాది మంది చిరుద్యోగుల పొట్టకొట్టింది. ఇప్పటికే ఐదేళ్లుగా పనిచేస్తున్న వలంటీర్లను పక్కన పెట్టింది. చివరికి మున్సిపాలిటీల్లో పనిచేసే నాలుగో తరగతి ఉద్యోగులను కూడా వదిలిపెట్టకుండా బలవంతంగా రాజీనామాలు చేయించి ఇంటికి పంపించింది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని వండిపెడుతూ జీవిస్తున్న కార్మికులను తొలగించి వారి కడుపుకొట్టింది. పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేసేవారిని సైతం 'మా ప్రభుత్వం వచ్చింది.. మీరు ఇంటికి వెళ్లండి' అంటూ కూటమి పార్టీల నేతలు తరిమేశారు. ఇలా చెప్పుకుంటూపోతే.. గడిచిన వందరోజుల కూటమి ప్రభుత్వ పాలనలో ఎందరో చిరుద్యోగులు, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఎన్నో దారుణాలు, దుర్మార్గాలకు ఒడిగట్టిన చంద్రబాబు ప్రభుత్వం.. ఇది మంచి ప్రభుత్వం అని ఎలా చెప్పుకుంటుందో అర్థం కావడం లేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార మదంతో నిరుపేద, మధ్య తరగతి ప్రజల కడుపులు కొడుతూ సిగ్గూ ఎగ్గూ లేకుండా తమ వంద రోజుల పాలనపై ఇది మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటూ ఎలా తిరుగుతోందని ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు.

రెట్టింపు జీతమంటూ వలంటీర్లకు మోసం...

ఎన్నికలకు ముందు ఎలాగైనా అధికారంలోకి రావడానికి వలంటీర్లకు రెట్టింపు జీతమంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. గౌరవ వేతనం రెట్టింపు చేసి పదివేలకు పెంచుతామని ఆశపెట్టారు. ఒక్క వలంటీర్‌ను కూడా ఉద్యోగం నుంచి తీసేయకుండా కొనసాగిస్తామంటూ మాట ఇచ్చారు. అంతకు ముందు ఎన్నోసార్లు వలంటీర్ల మీద ద్వేషాన్ని వెళ్లగక్కిన చంద్రబాబు.. ఎన్నికల సమయంలో మాత్రం కడుపులో కత్తులు పెట్టుకుని వలంటీర్లను కౌగిలించుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తొలిరోజే వలంటీర్లకు వెన్నుపోటు పొడిచి కక్షసాధింపు చర్యలకు దిగారు. ప్రమాణ స్వీకారం కూడా చేయకముందే వలంటీర్లను సచివాలయాలకు రాకుండా కట్టడి చేశారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అన్నిరకాల సేవలను ఇంటి వద్దకే అందించిన జిల్లాలోని 12,405 మంది వలంటీర్లు రోడ్డున పడ్డారు. ఉద్యోగం ఉందో..లేదో కూడా చెప్పకుండా మూడు నెలలుగా గౌరవ వేతనం కూడా ఇవ్వకుండా వారిని వేధిస్తున్నారు. చంద్రబాబు ఇలా దొంగదెబ్బ తీస్తారని అనుకోలేదని వారితో పాటు వారి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాల్గో తరగతి ఉద్యోగులనూ వదిలిపెట్టని వైనం...

నాల్గో తరగతి ఉద్యోగులను కూడా వదిలిపెట్టకుండా కక్ష సాధింపు చర్యలకు దిగడం కూటమి ప్రభుత్వం శాడిజానికి పరాకాష్టగా నిలుస్తోందని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో 729 పంచాయతీలకుగానూ 729 మంది ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు సాయంత్రం నుంచే ఉపాధి పనులు ఆపేయాలంటూ టీడీపీ నాయకత్వం అధికారులకు హుకుం జారీ చేసింది. నిజానికి ప్రతి ఏడాది జూన్, జూలై మాసాల్లోనే ఉపాధి హామీ పనులు జరుగుతాయి. ప్రతి ఏడాది కనీసం 2 లక్షల మంది ఉపాధి పనులు చేసుకుంటూ రోజులు గడుపుతుంటారు. ఇవేమీ పట్టించుకోకుండా ఈ ఏడాది ఉపాధి పనులను సైతం ఆపేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేగాకుండా ఫీల్డ్ అసిస్టెంట్లను రాజీనామా చేయాలని ఒత్తిడి చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాతికేళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్న వారిని కూడా బలవంతంగా రాజీనామా చేయమని హెచ్ఎంలతో ఒత్తిడి చేయించారు. చివరకు పాఠశాలల్లో కసుపూడ్చి మరుగుదొడ్లను శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులను కూడా వదిలిపెట్టడంలేదు. ఇక, పంచాయతీలు, పురపాలక సంఘాలలో పనిచేసే పారిశుధ్య కార్మికులను తీసేసి తమ సొంత మనుషులను నియమించుకున్నారు. కొన్ని చోట్ల చిరు ఉద్యోగాలను సైతం బేరం పెట్టి అమ్ముకుంటున్నారు. రేషన్ డీలర్ల నుంచి కోటా లాక్కుని తమ వారికి పంచిపెట్టారు. ఒంగోలు నగరంలో 70కిపైగా రేషన్ షాపులుంటే.. 600 మందికిపైగా తెలుగు తమ్ముళ్లు వాటి కోసం క్యూ కట్టడం చూస్తుంటే.. ఏ స్థాయిలో అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఎన్నడూ ఇంతటి దారుణం ఉండేది కాదని, ఏదైనా రాజకీయాలు ఉంటే పైస్థాయిలో చేసుకునే వారని, ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మొదటి సారిగా చిరుద్యోగుల పొట్టగొట్టిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

జిల్లాలో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న 534 మందికి మొండిచేయి...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాలను ప్రభుత్వం పరిధిలోకి తీసుకొచ్చి ప్రతి దుకాణంలో పనిచేసేందుకు ఔట్‌సోర్సింగ్ విధానంలో ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్‌లను నియమించారు. జిల్లాలోని 178 మద్యం దుకాణాలకుగానూ మొత్తం 534 మంది నిరుద్యోగ యువకులకు జీవనోపాధి కల్పించారు. వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులను కూడా లెక్కిస్తే కనీసం 2000 మందికిపైగా హాయిగా జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల తర్వాత రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామంటూ ఎన్నికల వేళ హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట నిలుపుకునే అలవాటు లేని చంద్రబాబు.. ఎప్పటిలాగే యువత ఆశలపై నీళ్లు చల్లారు. కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా, ఉన్న ఉద్యోగాలు ఊడబెరుకుతున్నారు. కూటమి పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, వారి అనుచరులు జేబులు నింపుకునేలా మద్యం పాలసీలో మార్పులు చేసి మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. దాంతో జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న 534 మంది సిబ్బంది ఉద్యోగాలు పోయి రోడ్డున పడ్డారు. ఐదేళ్లుగా ఔట్‌సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న వారికి ప్రత్యామ్నాయం చూపకుండా ఉన్నపలంగా ఉద్యోగం తీసేసి ఇంటికి పంపించడంతో వారంతా తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

తొలిరోజు టెట్ పరీక్షలు ప్రశాంతం

ఒంగోలు: తొలి రోజు టెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాలైన కృష్ణచైతన్య ఇంజినీరింగ్ కాలేజీ, డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కాలేజీ, ఒంగోలులోని బ్రిలియంట్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చెస్ సొసైటీలలో రెండు షిఫ్టులలో పరీక్షలు నిర్వహించారు. తొలి షిఫ్టు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది. మొత్తం 525 మందికిగానూ 461 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం షిఫ్టు 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. ఈ షిఫ్టులో 386 మందికిగానూ 333 మంది హాజరయ్యారు. మొత్తంగా తొలి రోజు పరీక్షకు 117 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా విద్యాశాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

13 వరకూ దసరా సెలవులు

ఒంగోలు: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఈ నెల 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయన్నారు. పనిదినాలు 220 కంటే తగ్గినప్పుడు మాత్రమే వరదలు/భారీ వర్షాల కారణంగా ఇచ్చిన సెలవులకు కాంపెన్సేట్ చేసుకునేందుకుగానూ దసరా సెలవులలో రెండు రోజులు పాఠశాలలు ఐచ్ఛికంగా నిర్వహించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాకాకుండా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి పాఠశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు.

విశాఖ ఉక్కును విక్రయించే హక్కు లేదు

ఒంగోలు టౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో ఎలాంటి పాత్ర లేని బీజేపీకి అడ్డగోలుగా దానిని విక్రయించే హక్కు లేదని ప్రజాసంఘాల నాయకులు తేల్చి చెప్పారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు గురువారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు ప్రసంగిస్తూ.. 32 మంది విద్యార్థుల బలిదానాలతో విశాఖ ఉక్కు సాధించుకున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం 1967లో 30 మంది సీపీఐ ఎమ్మెల్యేలు, 22 మంది సీపీఎం ఎమ్మెల్యేలు, 15 మంది స్వతంత్ర్య ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు రాజీనామా చేసి ఉద్యమాన్ని నిర్మించారని వివరించారు. ఎన్నో పోరాటాలు, మరెన్నో ఆత్మబలి దానాలతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను కార్పొరేట్లకు అప్పగించేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రాణాలైన అర్పించి విశాఖ ఉక్కును కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి ప్రసంగిస్తూ.. 3.50 లక్షల కోట్ల రూపాయల విలువ చేసే విశాఖ ఉక్కును కేవలం 13 వందల కోట్ల రూపాయలకు తన అనుకూల కార్పొరేట్లకు అమ్మేందుకు మోదీ ప్రయత్నించడం దేశద్రోహమని మండిపడ్డారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, రైతు కూలీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పరిటాల కోటేశ్వరరావు, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ పాల్గొని ప్రసంగించారు. నిరసన దీక్షలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొండారెడ్డి, కార్మిక, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఓం శ్రీ మాత్రే నమః



త్రిపురాంతకంలో ప్రత్యేక అలంకరణలో శ్రీ బాలాత్రిపురసుందరీదేవి మూలవిరాట్



శ్రీ బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో వల్లూరమ్మ

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం తొలిరోజు జిల్లాలోని ఆలయాల్లో అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష పూజలు అందుకున్నారు. ఆలయాలకు భక్తులు బారులుదీరారు. అమ్మవారి అనుగ్రహం పొంది భక్తిభావంతో పరవశించిపోయారు.

గ్రానైట్ అక్రమ రవాణా అరికట్టాలి



జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో గ్రానైట్ అక్రమ రవాణాను అరికట్టేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గ్రానైట్ స్లాబ్‌ల అక్రమ రవాణాపై స్థానిక ప్రకాశం భవనంలో గురువారం జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రానైట్ అనధికార రవాణాను నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించి పలు సలహాలు, సూచనలు చేశారు. గ్రానైట్ అక్రమ రవాణాను అరికట్టేందుకు మైనింగ్, రెవెన్యూ, పోలీసు, కమర్షియల్ టాక్స్, జియాలజీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అవసరమైన మేరకు మొబైల్ బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అవసరమైన ప్రదేశాల్లో సీసీ కెమేరాలు బిగించాలని ఆదేశించారు. జిల్లాలో గ్రానైట్ స్లాబ్‌ల అక్రమ రవాణాపై తరుచూ ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చీమకుర్తి మండలంలోని బూదవాడ, ఆర్‌ఎల్ పురం, చీమకుర్తి గ్రామాల్లో 85 బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ క్వారీలు పనిచేస్తున్నాయని, సగటున జిల్లాకు రూ.250 కోట్ల రెవెన్యూ వస్తోందని తెలిపారు. ఉత్పత్తి చేసే గ్రానైట్ మెటీరియల్‌లో 80 శాతం విదేశాలకు.. ముఖ్యంగా చైనా, థైవాన్, యూరోపియన్ దేశాలకు ఎగుమతి చేయడం జరుగుతోందని అన్నారు. మిగిలిన 20 శాతం గ్రానైట్ స్థానిక గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ పరిశ్రమల్లో ప్రాసెస్ చేయడం జరుగుతోందన్నారు. గత ఐదేళ్లలో జిల్లాలో గ్రానైట్ స్లాబ్‌ల అక్రమ రవాణాపై 1,225 కేసులు నమోదు చేసి రూ.206.31 కోట్లు పెనాల్టీ విధించినట్లు మైనింగ్ డీడీ రాజశేఖర్ కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీటీసీ సుశీల, కమర్షియల్ ట్యాక్స్, మైన్స్, జియాలజీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే బూచేపల్లి



ఎస్పీకి బొకే అందజేస్తున్న బూచేపల్లి

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయానికి గురువారం వచ్చిన ఆయన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. బూచేపల్లి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

రేపు సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ క్రీడా జట్ల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ క్రీడా జట్లను ఈనెల 5న ఎంపిక చేయనున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రవీంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో సాయంత్రం 2 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 2011లో పుట్టిన బాలబాలికలు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు. వివరాలకు 9866126955, 9849429839ను సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతానికి రైతు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అంకమరావు

మార్కాపురం రూరల్: విద్యుదాఘాతానికి రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బొందలపాడులో జరిగింది. బంధువుల తెలిపిన వివరాల ప్రకారం..మారంరెడ్డి వెంకట సుబ్బారెడ్డి (53) తన పొలానికి అడవి పందుల రక్షణ కోసం కరెంటు ఫెన్సింగ్ ఏర్పాటుచేశాడు. పక్క పొలానికి చెందిన విద్యుత్ తీగ తెగిపడి కరెంటు ఫెన్సింగ్‌పై పడటంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు.

ఇసుక తవ్వకాలకు అనుమతి తప్పనిసరి

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఇసుక భూములకు సంబంధించి పట్టాదారులు, డీకేటీ పట్టాదారులు ఇసుక తవ్వకాల అనుమతి కోసం తరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ప్రకాశంభవనంలో గురువారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. వాగులు, వంకల్లో ఇసుక తవ్వకాలు, రవాణా సంబంధిత సరిహద్దు గ్రామాల పరిధిలో జరగాలన్నారు. ప్రక్రియను స్థానిక వీఆర్‌ఓ, పంచాయతీ సెక్రటరీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాధ్యత వహిస్తూ ఇసుక రవాణాను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలువురు ఎస్సైలకు స్థానచలనం

ఒంగోలు టౌన్: జిల్లాలో పలువురు ఎస్సైలకు స్థానచలనం కల్పించారు. వీఆర్‌లో ఉన్న ఇద్దరు ఎస్సైలకు పోస్టింగులు ఇచ్చి, మరో ఇద్దరికి వీఆర్‌కు పంపించారు. వీఆర్‌లో ఉన్న బి. ప్రేమ్ కుమార్‌ను కొండపి పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. కొండపిలో పనిచేస్తున్న ఎం. కృష్ణ బాజీ బాబును వీఆర్‌కు పంపించారు. జిల్లా వీఆర్‌లో ఉన్న వి. అజయ్‌బాబును సంతనూతలపాడు పీఎస్‌కు బదిలీ చేసి, సంతనూతలపాడులో విధులను నిర్వర్తిస్తున్న ఎం. దేవ కుమార్‌ను వీఆర్‌కు పంపించారు. ఈ మేరకు గురువారం ఎస్పీ ఉత్తర్వులను జారీ చేశారు.

బాణసంచా విక్రయాల లైసెన్స్‌కు దరఖాస్తులు

ఒంగోలు అర్బన్: దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటుకు తాత్కాలిక లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత తెలిపారు. ప్రకాశం భవనంలో తాత్కాలిక బాణసంచా విక్రయాలపై పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విపత్తు, అగ్నిమాపక, పంచాయతీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు తాత్కాలిక లైసెన్స్ కోసం శుక్రవారం నుంచి 15వ తేదీ లోగా మీసేవ కేంద్రాలు, సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు చిరునామా, ఆధార్, జనన ధృవ పత్రం, అఫడవిట్, వాణిజ్య శాఖ ఎన్‌టీసీ, పోలీసు శాఖ ధృవీకరణ, విపత్తు, అగ్నిమాపక విభాగం నుంచి ధృవీకరణ, స్థానిక సంస్థల ధృవీకరణతో పాటు మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు అందచేయాలన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం లైసెన్సులు ఇస్తామన్నారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు మూడు రోజులు మాత్రమే బాణాసంచా విక్రయాలు చేయాలన్నారు. ఆ మేరకు నగరపాలక, మున్సిపల్ కమిషనర్‌లు, తహశీల్దార్లు, పోలీసు అధికారులు వ్యక్తిగతంగా పర్యవేక్షించి దీపావళి బాణసంచాను విక్రయించేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. జనావాసాల మధ్య లేకుండా చూడాలన్నారు.

గస్తీకి సుస్తీ.. దొంగలు మస్తీ!



జూలై 20న సంగా వీధిలో చోరీ జరిగిన ఇల్లు(ఫైల్)

- కంభంలో వరుస చోరీలతో జనం బెంబేలు
- చోరీ సొత్తు రికవరీలో కొనసాగుతున్న జాప్యం
- ఖాకీలకు సవాల్‌గా మారిన చోరీ కేసుల దర్యాప్తు
- సీసీ కెమెరాలున్నా చేతివాటం ఆపని దొంగలు
- సీసీ కెమెరాల డీవీఆర్, హార్డ్‌డిస్క్‌లు సైతం అపహరణ
- గస్తీని మరింత పెంచి దొంగలను కట్టడి చేయాలని ప్రజల వినతి



మే 18న సూపర్‌మార్ట్‌లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్(ఫైల్)

కంభం: చీకటి పడగానే కంభం వాసులను దొంగల భయం వెంటాడుతోంది. పనిపై ఊళ్లకు వెళ్లిన వారే కాదు.. ఇళ్ల దగ్గర ఉన్న వారు సైతం దొంగల దెబ్బకు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల కాలంలో కంభం పట్టణంలో వరుసగా జరుగుతున్న చోరీలే అందుకు కారణం. సీసీ కెమెరాలు ఉన్నా దొంగలు ఏ మాత్రం జంకూ బొంకు లేకుండా పని ముగించుకుని పలాయనం చిత్తగిస్తున్నారు. దొంగలు ఇంకో అడుగు ముందుకేసి సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లను, డీవీఆర్ బాక్స్‌లను ఎత్తుకెళ్లిపోతుండటంతో వారి ఆచూకీ కనుగొవడం పోలీసులకు కష్టతరంగా మారుతోంది. చోరీలను కట్టడి చేసేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులు, ప్రజలకు గతంలో పలుమార్లు పోలీసులు సూచనలిచ్చారు. ఈ క్రమంలోనే ఎంతో మంది ముందు జాగ్రత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ దొంగలు ఏమాత్రం ఖాతరు చేయకపోతుండటం గమనార్హం. కొన్ని చోట్ల దొంగల చిత్రాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమవుతున్నా వారిని శిక్షించడంలో జాప్యం జరుగుతుండటంపై బాధితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై ఉదాసీనత

ఇల్లు విడిచి ఒకటీరెండు రోజులు లేదా అంత కంటే ఎక్కువ సమయం బయట ప్రాంతాలకు వెళ్లే వారు, తీర్థయాత్రలు, విదేశీ టూర్లకు వెళ్లే వారు తప్పనిసరిగా ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) యాప్‌లో వివరాలు పొందుపరచాలని సామాజిక మాధ్యమాలు, మహిళా పోలీసుల ద్వారా పోలీస్ అధికారులు అవగాహన కల్పించినా కొందరు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారు. వాస్తవానికి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లో పేరు నమోదు చేసుకున్న వారి ఇళ్లకు పోలీసులు 24 గంటలూ రక్షణ కల్పిస్తారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోని వారి పరిస్థితి చేతులు కాలక ఆకులు పట్టుకున్న చందంగా మారుతోంది. ఇదిలా ఉండగా కంభంలో దుకాణాలు, ఇళ్ల బయట పార్క్ చేసి ఉంచిన ద్విచక్ర వాహనాలు మాయం అవుతుండటం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది.

కొత్తపంథాలో దొంగతనాలు

కంభంలో దొంగలు ఇటీవల కాలంలో కొత్త పంథాలో చోరీలకు పాల్పడుతున్నారు. దొంగతనానికి వెళ్లిన దుకాణం లేదా ఇంటిని పరికించి చూడటం.. సీసీ కెమెరాలు ఉంటే వాటి డీవీఆర్‌లు ఎక్కడున్నాయో గుర్తించి అపహరించడం చేస్తున్నారు. షట్టర్లు, తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లే ప్రక్రియ నుంచి గోడలకు మనిషి దూరేంత పరిమాణంలో కన్నాలు వేసి మరీ సొత్తు అపహరిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ కూడలి, హైవే రోడ్ల వెంట ఇటీవల జరిగిన చోరీలు ఖాకీలకు సవాల్ విసిరాయి. వరుస చోరీల నేపథ్యంలో పోలీసులు గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ ఏడాది కంభంలో చోరీలు ఇలా..

- జనవరి 8న ఓ వ్యక్తి కంభం ఎస్‌బీఐ ఎదుట రూ. 2.50 లక్షలను బైక్ ట్యాంక్‌లో ఉంచి ఫోన్‌లో మాట్లాడుతుండగా అపహరించారు.
- మార్చి 25న చౌక్ సెంటర్‌లో ఉదయం 11 గంటలకు పార్క్ చేసి ఉన్న ఓ ద్విచక్ర వాహనం చోరీ కాగా కొన్ని రోజుల తర్వాత వినుకొండ పోలీసులకు దొరికింది.
- ఏప్రిల్ 15వ తేదీన కందులాపురం కూడలిలోని ఓ హోటల్ గోడకు రంధ్రం వేసి 42 ఇంచ్‌ల టీవీని అపహరించారు.
- మే 18న హైవే రోడ్డుకు ఆనుకొని ఉన్న సింధూరి సూపర్‌మార్ట్‌లో దొంగలు పడి రూ.80 వేల నగదు, నిత్యావసర వస్తువులు అపహరించారు. ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమవగా హార్డ్ డిస్క్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు.
- జూలై 3న కంభం అర్బన్ కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి వస్తువులు అపహరించుకెళ్లారు.
- జూలై 20న సంగా వీధిలో పండ్ల వ్యాపారి ఇంట్లో దొంగలు పడి బంగారు నగలు, నగదు అపహరించుకెళ్లారు. అదే రోజు అదే వీధిలో ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న పల్సర్ బైక్ అపహరణకు గురైంది.
- ఆగస్టు 5న పట్టణంలోని చైతన్య స్కూల్ సమీపంలో పట్టపగలు నలుగురు మహిళలు నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద ఇనుప పనిముట్లను అపహరించుకెళ్లారు.
- ఆగస్టు 7న హైవే రోడ్డు సమీపంలోని ఓపూజారి నివాసంలో దొంగలు పడి విలువైన వస్తువులు అపహరించారు. ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తం కాగా హార్డ్ డిస్క్‌ను సైతం దొంగలు పట్టుకెళ్లిపోయారు.
- సెప్టెంబర్ 1వ తేదీన చౌక్ సెంటర్‌లో ఇంటి ముందు పార్క్ చేసిన బుల్లెట్ వాహనం అపహరణకు గురికాగా ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. అదే రోజు రాత్రి రావిపాడు రోడ్డులోని ఓ చిన్న హోటల్‌లో దొంగతనానికి విఫలయత్నం జరిగింది.
- సెప్టెంబర్ 27వ తేదీ రాత్రి కంభం బస్టాండ్ సమీపంలో ఓ ఎలక్ట్రికల్ సామగ్రి దుకాణంలో గోడకు రంధ్రం వేసి సుమారు రూ.లక్ష నగదు, విలువైన వైరు కట్టలు అపహరించారు. ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షప్తమవగా హార్డ్ డిస్క్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు
- అక్టోబర్ 2వ తేదీన కందులాపురం కొండపై ఉన్న ఆలయంలో దొంగలు పడి సుమారు రూ.18 వేల విలువ చేసే ఇత్తడి గంటలు అపహరించారు. ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి.
- వీటితో ఇంకా పలు ద్విచక్రవాహనాలు, పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న రాగితీగలు, ఇతర వస్తువులు అపహరణకు గురికాగా బాధితులంతా పోలీసులను ఆశ్రయిస్తున్నారు.



సెప్టెంబర్ 1న చౌక్ సెంటర్‌లో బుల్లెట్ వాహనం అపహరణ దృశ్యం (ఫైల్)



మార్ట్‌లో దొంగతనానికి ప్రవేశిస్తున్న వ్యక్తి(సీసీ ఫుటేజ్)(ఫైల్)



సెప్టంబరు 27న ఎలక్ట్రికల్ షాపులో చోరీకి పాల్పడిన వ్యక్తి(ఫైల్)

రైతులకు రుణాలెందుకు ఇవ్వడం లేదు..?

- ఎల్‌డీఎంను ప్రశ్నించిన కలెక్టర్ అన్సారియా
- మోటుమాలలో పొలం పిలుస్తోంది.



పొలం పిలుస్తోందిలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కొత్తపట్నం: 'పంటల సాగుకు రైతులకు రుణాలు ఎందుకు ఇవ్వడం లేదు. రొయ్యలు సాగు చేసే రైతులు ఎంత మందికి రుణాలు ఇచ్చారు. రైతులు ఏ పంట సాగు చేసినా రుణాలివ్వాల్సిందే'నని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. మండలంలోని మోటుమాల గ్రామంలో గురువారం పొలం పిలుస్తోందిలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రొయ్య సాగు చేసే రైతులంతా రుణాల కోసం బ్యాంకు మేనేజర్‌ను కలవాలని, రుణాలు ఇవ్వకపోతే నా దృష్టికి తీసుకురండని చెప్పారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి పంటల దిగుబడి పెరిగేలా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడమే లక్ష్యంగా పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్నామన్నారు. రైతులకు అవసరమైన సాంకేతిక సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి వినూత్న సాగు విధానాలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు కేవలం వ్యవసాయంపైనే కాకుండా దాని అనుబంధ రంగాల్లో కూడా అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సేంద్రియ వ్యవసాయానికి కొత్తపట్నం మండలాన్ని మోడల్‌గా ఎంపిక చేశామన్నారు. రైతులకు అవసరమైన రుణాలు కూడా సత్వరమే మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామస్తుడు పురిణి శ్రీను మాట్లాడుతూ పాదర్తి ఇరిగేషన్ చెరువు ఆక్రమణకు గురవుతుందని, గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, గ్రామంలో ఆన్‌లైన్ సమస్య వేధిస్తోందని కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ స్పందిస్తూ అర్జీ రూపంలో సంబంధిత అధికారులకు ఇవ్వాలని కోరారు. అనంతరం కొప్పోలు రోడ్డులో ఉన్న రాణిమ్మ కాలనీని కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల ఎస్పీ కమిషన్ సభ్యుడు పర్యటన సమయంలో ఇళ్ల సమస్యను పరిష్కరించాలని గిరిజనులు ఆయన్ను కోరారు. ఈ క్రమంలో కలెక్టర్ కాలనీని పరిశీలించారు. గతంలో స్థానికంగా గిరిజనులు నివసించే వారని, కొన్నేళ్ల క్రితం భారీ వర్షాలకు పక్కనే నల్లవాగు పొంగడంతో ఇళ్లలోకి నీరు చేరాయన్నారు. అప్పటి నుంచి కాలనీని ఖాళీ చేసినట్లు తెలిపారు. దీనిపై అధికారులు సమాధానమిస్తూ లెవలింగ్ చేయడంతో పాటు వరద నీరు రాకుండా చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మించవచ్చని కలెక్టర్ వివరించారు. లెవలింగ్‌కు రూ.40 లక్షలు, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సుమారు రూ.1.4 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే ఇంత ఖర్చు చేసే బదులు ప్రత్యామ్నాయ లే అవుట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించే విషయాన్ని పరిశీలించవచ్చని అధికారులు చెప్పగా..సమీక్షించి నిర్ణయం తీసుకుందామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం రంగాయపాలెంలో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ సుబ్బారెడ్డి, మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖర్ రెడ్డి, హౌసింగ్ పీడీ పి.ప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి జగన్నాథరావు, మున్సిపల్ కమిషన్ కె.వెంకటేశ్వరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ పీవీ రమణ, ఎల్‌డీఎం డి.రమేష్, డీపీఎం ఇ.సుభాషిణి, ఆత్మ పశుసంవర్ధక శాఖల తహసీల్దార్ మధుసూదన్ రావు, డీటీ అర్జున్‌రెడ్డి, పశు వైద్యాధికారి అనూషా, ఏఓ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం



ది చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి కీర్తి సురేష్



షాపింగ్ మాల్‌లో పట్టుచీరలు చూపుతూ..

ఒంగోలు టౌన్: దసరాకు ముందే ఒంగోలుకు పండగ వచ్చింది. ప్రముఖ సినీ నటి కీర్తి సురేష్ చేతుల మీదుగా చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభమైంది. నటి కీర్తి సురేష్‌ను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా సినీనటి కీర్తి సురేష్ మాట్లాడుతూ. దసరా పండుగ అంటే చాలా పెద్ద పండుగ అని, పండగను మరింత ఎంజాయ్ చేయాలంటే చెన్నయ్ షాపింగ్ మాల్‌కు వచ్చి దుస్తులు కొనుగోలు చేయాలని కోరారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే మొత్తం 19 షాపింగ్ మాల్స్ ఉన్నాయని, ఒంగోలులో 20వ బ్రాంచీని ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ అన్నీ వయసుల వారికి తగిన దుస్తులు లభిస్తాయని, సంప్రదాయ దుస్తులతో పాటుగా ఆధునిక ఫ్యాషన్ కలిగిన దుస్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒంగోలు నగరం రోజురోజుకు శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, ఇక్కడి ప్రజల అభిరుచులకు అనుగుణంగా చెన్నయ్ షాపింగ్ మాల్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. చెన్నయ్ షాపింగ్ మాల్‌తో ఒంగోలుకు నూతన కళ వచ్చిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా వీరాంజనేయ స్వామి చెప్పారు. దుకాణం యజమాని మర్రి జమున మాట్లాడుతూ.. చెన్నయ్ షాపింగ్ మాల్‌లో రూ.99 నుంచి రూ.3 లక్షల విలువైన రలు లభ్యమౌతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, నగర మేయర్‌గంగాడ సుజాత, కార్పొరేటర్ తేలపల్లి ధనలక్ష్మి, దుకాణం యజమాని మర్రి వెంకట రెడ్డి, కృష్ణారావు పాల్గొన్నారు.

పొదిలిలో ముగిసిన పొగాకు వేలం

- రూ.385.50 కోట్ల విలువైన పొగాకు కొనుగోలు
- అనుమతించింది 9.65 మి.కిలోలు, అదనపు పంట 5.15 మి.కిలోలు



చివరి రోజు వేలం నిర్వహిస్తున్న గిరిరాజ్‌కుమార్

పొదిలి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో 2023–24 పంట కాలానికి సంబంధించి రూ.385.50 కోట్ల విలువైన పొగాకు కొనుగోళ్లు జరిగినట్లు నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ వెల్లడించారు. ఈ ఏడాది మార్చి 6వ తేదీన వేలం ప్రక్రియ ప్రారంభం కాగా చూర, ముక్కతో సహా కొనుగోళ్లు పూర్తయ్యాయని స్పష్టం చేశారు. వేలం కేంద్రం పరిధిలోని 4332 మంది రైతులు పండించిన పొగాకును 47 కంపెనీల వారు కొనుగోలు చేశారని తెలిపారు. అధికారికంగా 9.65 మిలియన్ కిలోల పొగాకుకు అనుమతి ఉండగా, అదనపు పంట ఉత్పత్తి 5.15 మిలియన్ కిలోలు వచ్చిందని, మొత్తం 14.73 మిలియన్ కిలోలను వ్యాపారులు కొనుగోలు చేశారని వివరించారు. సగటు ధర కేజీ రూ.263.79 కాగా, అత్యధిక ధర రూ.364, అత్యల్ప ధర రూ.40 రైతులకు దక్కిందని చెప్పారు. ఈ ఏడాది పొగాకు మార్కెట్ సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ ఇవే ధరలు వచ్చే ఏడాది కొనసాగుతాయని చెప్పలేమన్నారు. ఈ నేపథ్యంలో అధిక కౌలుకు పొలాలు, బ్యారన్లు తీసుకుని నష్టపోవద్దని రైతులకు హితవు పలికారు. అంతర్జాతీయ మార్కెట్‌లో తేడాలు వస్తే రైతులు నష్టపోతారని, అనుమతించిన మేర మాత్రమే తక్కువ పెట్టుబడితో ఎక్కువ నాణ్యత కలిగిన పొగాను ఉత్పత్తి చేయాలని రైతులను కోరారు.

పుష్ప వాహనంపై బాలా త్రిపురసుందరీదేవి



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు త్రిపురాంతక క్షేత్రంలో గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు తొలి రోజు పుష్ప వాహనంపై శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో హంస వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు.

– త్రిపురాంతకం

మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డికి మాతృవియోగం



చెంచమ్మకు నివాళులర్పిస్తున్న దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

మార్కాపురం రూరల్: మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు కేపీ కొండారెడ్డి మాతృమూర్తి కుందురు చెంచమ్మ (98) గురువారం తెల్లవారుజామున కొండేపల్లిలో మృతి చెందారు. చెంచమ్మ పార్థివదేహాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు గ్రామానికి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కొండారెడ్డితో పాటు ఆయన తనయులు కేపీ నాగార్జునరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని, ఎంపీటీసీ మల్లారెడ్డి, చిన్నకొండారెడ్డిని పరామర్శించారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి పెద్ద కుమారుడు.

అందని ద్రాక్షలా ఇసుక

- ధర్నాలో సీపీఎం నేతల విమర్శ



ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు, కార్మికులు

మార్కాపురం టౌన్: మార్కాపురంలో ఇసుక అందని ద్రాక్షాలా తయారైందని, డబ్బుంటే బంగారమైనా కొనుక్కోవచ్చని, ఇసుక కొనలేని దుస్థితి ఏర్పడిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దగ్గుబాటి సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి 120 రోజులైనా ఉచిత ఇసుక హామీ అమలు చేయకపోగా, రూ.1100 ఉన్న టన్ను ఇసుక రూ.2 వేలకు చేరిందని, అయినా కూడా దొరకడంలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఇసుక పాలసీ పేదల కడుపు కొడుతోందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసి అన్నీ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రంలో లభించే ఇసుకను ఇతర రాష్ట్రాలకు అధిక ధరలకు అధికార పార్టీ నాయకులు బ్లాక్‌లో అమ్ముకోవడం వల్ల తీవ్ర కొరత ఏర్పడిందని ధ్వజమెత్తారు. ఇసుక అక్రమ తరలింపుపై విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుమ్మా బాల నాగయ్య, డీకేఎం రఫీ, జవ్వాజీ రాజు, షేక్ నన్నేసా, షేక్ కరీముల్లా, వై సురేష్‌కుమార్, మేస్త్రీలు శివారెడ్డి, వెంకటరెడ్డి, కాశిరెడ్డి, పిల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.